సాక్షి
విజయనగరం

సోమవారం । 21 । జూలై । 2025



శ్రావణం.. శుభప్రదం
సకల శుభాల శ్రావణ మాసం ఈ నెల 25న ఆరంభం కానుంది. మంచి రోజులు వస్తుండడంతో పెళ్లి బాజాలు మోగనున్నాయి.
- 8లో



'ఆడలి'కి తగ్గుతున్న ఆదరణ
సీతంపేట ఏజెన్సీలో అత్యంత ప్రాచుర్యం పొందిన ఆడలి వ్యూపాయింట్ పర్యాటక ప్రాంతం పర్యాటకులు లేక వెలవెలబోతోంది.
- 8లో



పాపం..పసివాడు
ముక్కుపచ్చలారని పసికందు. బోసినవ్వులతో అమ్మ ఒడిలో లాలన..ఆలనతో గడిచిపోవలసిన పసిప్రాణం. బాల్యంలోనే మాయదారి రోగం ఆవహించింది.
- 8లో

న్యూస్‌రీల్

చదువుపై దృష్టి సారించాలి

- సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న డి.డి అన్నపూర్ణ

గంట్యాడ: విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచిగా ఎదగాలని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నపూర్ణ అన్నారు. మండలంలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహంలో విద్యార్థులకు ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయిని మరింత మెరుగుపరిచేందుకు ఇకపై ప్రతి నెల మూడో ఆదివారం క్విజ్ పోటీలను నిర్వహించేందుకు నిర్ణయించినట్టు పేర్కొన్నారు. చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహ వార్డెన్ గొర్లె గోవింద సన్యాసిరావు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ మెమో 57ను తక్షణం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాజు

బొబ్బిలి: ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57ను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కౌన్సిలర్ జేసీ రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం మెమో 57ను విడుదల చేసి ఏళ్లు గడుస్తున్నా దాన్ని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. తద్వారా 2003కు ముందు ఉద్యోగ నియామకం పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 2023 జూలై నుంచి ఉద్యోగులకు 12వ వేతన సవరణ జరగాల్సి ఉండగా రెండేళ్లు గడుస్తున్నా నేటి ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయకపోవడం ఆందోళనకు గురి చేస్తోందని పేర్కొన్నారు.

కూటమి నేతలు ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమల్లో విభిన్న పద్ధతులు అవలంబిస్తూ లబ్ధిదారులను గందరగోళానికి గురి చేస్తున్నారు. ఉచిత గ్యాస్ విధానంలో ఇప్పటికీ మొదటి విడత డబ్బులు మాత్రమే పడ్డాయి. అలాగే తల్లికి వందనం పథకం పరిస్థితి చూస్తే మరీ గందరగోళం.. అర్హత ఉండి కూడా వేల సంఖ్యలో తల్లులకు డబ్బులు పడలేదు. దీనికి ఏదో ఒక కారణం చూపి పథకాన్ని నిలిపివేశారు. ఇప్పుడు అన్నదాత సుఖీభవ వంతు వచ్చింది. ఇందులోనూ గందరగోళమే... ఒకరి భూమికి వేరొకరి ఆధార్ లింక్ చేసి సమస్యలను సృష్టిస్తున్నారు. గతంలో లేని ఈ ఇబ్బందులు ఇప్పుడు ఎలా తెరపైకి వచ్చాయో అర్థం కాక లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అర్హత ఒక్కటే ప్రామాణికంగా చేసి పార్టీలకతీతంగా అందరికీ పై పథకాలన్నీ సకాలంలో అమలు చేసి జగన్‌మోహన్‌రెడ్డి శభాష్ అనిపించుకున్నారు. మరి అప్పుడు లేని అడ్డంకులు ఇప్పుడు ఎందుకు.. ఎలా.. వస్తున్నాయంటూ లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు.



'అన్నదాత సుఖీభవ'కు అడ్డంకులెన్నో...!

- తహసీల్దార్ లాగిన్‌లో 74,311 దరఖాస్తుల పెండింగ్
- పరిష్కారమైతేగానీ సాయం అందని పరిస్థితి
- రెవెన్యూ అధికారుల తీరుపై అన్నదాత గుర్రు
- కావాలనే ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తుందనే విమర్శలు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు పొటుపు రెడ్డి దేముడు. ఇతనిది గంట్యాడ మండలం పెద వేమలి గ్రామం. ఇతని భూమికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలు, వన్ బీ ఉన్నాయి. ఆధార్ కార్డు ఉంది. అయితే ఇతని ఆధార్ కార్డుకు ఆయన తండ్రి నరసింహులు పేరు లింక్ అయింది. దీంతో సమస్య పరిష్కారం కోసం తహసీల్దార్ లాగిన్‌కు వ్యవసాయ సిబ్బంది పంపించారు. దీని పరిష్కారం కోసం దేముడు ఎదురు చూస్తున్నాడు.



నారు తీస్తున్న రైతులు

జిల్లాలో మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య	
మండలం	పెండింగ్ దరఖాస్తులు
విజయనగరం	3675
పూసపాటిరేగ	2620
భోగాపురం	2240
గంట్యాడ	6026
డెంకాడ	1650
చీపురుపల్లి	6079
మెరకముడిదాం	1229
నెల్లిమర్ల	5214
గరివిడి	3847
గుర్ల	7031
ఎల్.కోట	1130
కొత్తవలస	727
ఎస్.కోట	194
వేపాడ	2289
గజపతినగరం	2261
బొండపల్లి	2952
దత్తిరాజేరు	1971
మెంటాడ	2515
బొబ్బిలి	1302
రామభద్రపురం	2797
తెర్లాం	249
బాడంగి	2626
రాజాం	5701
వంగర	2386
ఆర్.ఆమదాలవలస	2353
సంతకవిటి	1437

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో వేల మంది రైతుల పరిస్థితి దేముడు లాగే ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పథకం వచ్చే వారికి కూడా ఇప్పుడు రాని పరిస్థితి నెలకొంది. రైతులకు చెందిన భూ సమస్యలు ఉంటే వాటిని వ్యవసాయ సిబ్బంది తహసీల్దార్ లాగిన్‌కు పంపిస్తున్నారు. అక్కడ ఆ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు రైతుల సమస్యను పరిష్కరించకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. కూటమి సర్కార్ అన్నదాత సుఖీభవ పథకం ఇవ్వకుండా జాప్యం చేస్తుంది. ఎప్పుడు ఇస్తుందో తెలియని పరిస్థితి. ఒక వేళ ఇచ్చినట్టయితే తమకు ఇలాంటి సమస్యల వల్ల అన్నదాత సుఖీభవ సాయం రాదనే ఆవేదనలో రైతులు ఉన్నారు. భూ సమస్యలు పరిష్కరించాల్సింది రెవెన్యూ అధికారులే కదా.. వారు సకాలంలో పరిష్కరించకుంటే మాకు అందాల్సిన సాయం పరిస్థితి ఏమిటని రైతులు ఆవేదన చెందుతున్నారు. తహసీల్దార్ లాగిన్‌లో ఇటువంటి సమస్యలు వేలల్లో పెండింగ్ ఉండడంతో వ్యవసాయ అధికారులు సైతం తలలు పట్టుకుంటున్నారు. లాగిన్‌లో ఉన్న సమస్యల కోసం వ్యవసాయ అధికారులు అడుగుతున్నప్పటికీ వారి నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సమస్యలు పరిష్కారమైతేనే...

తహసీల్దార్ లాగిన్‌లో ఉన్న రైతుల సమస్యలను పరిష్కరిస్తేనే ప్రభుత్వం ఇచ్చే సాయం అందుతుంది. లేకుంటే రైతులు నష్టపోవాల్సిందే. ఈ పరిస్థితిలో ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పెట్టుబడి సాయం అందక ఇబ్బంది పడుతున్న రైతుల వేదన తీర్చేదెవరని? వారు ప్రశ్నిస్తున్నారు.

వేలల్లో దరఖాస్తుల పెండింగ్

జిల్లా వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ పథకం కోసం తహసీల్దార్ లాగిన్‌ల్లో వేలాది మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. 74,311 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు అధికారక లెక్కలే చెబుతున్నాయి. అధిక శాతం మండలాల్లో పరిష్కారానికి నోచుకోక పెండింగ్‌లో ఉన్నాయి. మరి రెవెన్యూ అధికారులు వాటిని ఎప్పటికి పరిష్కరిస్తారో చూడాలి మరి.

ఫార్వర్డ్ చేశాం..

అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి భూ సమస్యలు ఉన్న వారి వివరాలను తహసీల్దార్ లాగిన్‌కు ఇప్పటికే ఫార్వర్డ్ చేశాం. అక్కడ పరిష్కరించిన తరువాత మాకు పంపిస్తారు.
– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయాధికారి

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలొద్దు

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం :



పృథ్వీతేజ్ ఇమ్మడి

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విషయంలో ఎలాంటి అపోహలు అవసరం లేదని, వీటితో వినియోగదారులపై అదనపు భారం ఉండే అవకాశమే లేదని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. స్మార్ట్ మీటర్ల ప్రక్రియ విషయంలో వస్తున్న వదంతులపై ఆయన స్పందిస్తూ.. ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ వినియోగదారుల సేవల్లో పారదర్శకతను మరింత పెంచేందుకు ఆర్డీఎస్ఎస్ పథకంలో భాగంగా రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు జరుగుతోందని పేర్కొన్నారు. ఏపీఈఆర్సీ రెగ్యులేషన్ ప్రకారం ప్రభుత్వ, వాణిజ్య కేటగిరీల వినియోగదారులకు ప్రస్తుతం వీటిని అమర్చుతున్నామని పేర్కొన్నారు. వీటితో పాటు ఎక్కువ విద్యుత్ వినియోగం కలిగిన (హై వేల్యూ) గృహ వినియోగదారులకు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు సమయంలో వినియోగదారులు వాటి ఖరీదు, ఛార్జీలు కానీ, మామూళ్లు కానీ చెల్లించవలసిన అవసరం లేదని సీఎండీ తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల వినియోగదారులపై విపరీత భారాలు పడతాయనే ఆందోళన అవసరం లేదన్నారు. స్మార్ట్ మీటర్లు పాత మీటర్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవని, వీటి కారణంగా బిల్లులు పెరిగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పాత మీటర్లతో పోలిస్తే స్మార్ట్ మీటర్ల ద్వారా మరింత పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. ఏపీఈఆర్సీ నిర్ణయించిన టారిఫ్ ప్రకారమే విద్యుత్ బిల్లులు వసూలు చేస్తామని పేర్కొన్నారు.

ఈ మీటర్లకు సంబంధించిన బిల్లు వివరాలను నేరుగా వినియోగదారుని మొబైల్‌కు చేరవేస్తామని ఆయన చెప్పారు. వినియోగం, ఖర్చుపై పూర్తి నియంత్రణ వినియోగదారుల చేతుల్లో ఉండటం వలన విద్యుత్ వినియోగాన్ని మెరుగ్గా ప్లాన్ చేయడంలో స్మార్ట్ మీటర్లు సహాయకరిస్తాయని పేర్కొన్నారు. ఈ విషయంలో వినియోగదారులకు ఎలాంటి సందేహం ఉన్నా.. టోల్ ఫ్రీ నంబరు 1912కి సంప్రదించాలని సీఎండీ పృథ్వీతేజ్ ఆ ప్రకటనలో సూచించారు.



అశ్వ వాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

అమ్మవారికి ఆషాఢం సారె

విజయనగరంలోని పెద్దచెరువు ఉత్తర గట్టుపై ఉన్న శ్రీవిజయసాగర దుర్గామల్లేశ్వరమ్మ వారికి ఆషాఢం సారెను ఆదివారం సమర్పించారు. హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారికి భక్తులు ఉదయం పసుపు, కుంకుమలు అందజేసి, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఏడు ఎడ్ల బండ్లపై కొబ్బరి బొండాలు, వివిధ రకాల స్వీట్లు, పండ్లు, పూలతో కోట వద్ద నుంచి ర్యాలీగా వెళ్తూ సారెను ఊరేగించారు. బాజాభజంత్రీలు, మేళతాళాలు, విచిత్ర వేషధారణల ప్రదర్శన నడుమ సాగిన ఈ కార్యక్రమం అందరిలో ఆధ్యాత్మిక భావం పెంపొందించింది. భక్తులు అమ్మవారికి ఘటాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు కొండబాబు, ప్రతినిధులు మీనమ్మ, స్రవంతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.
– విజయనగరం టౌన్





ఎడ్ల బండ్లపై అమ్మవారికి సారె

కొలువుల కాణాచి జేఎన్‌టీయూ‌ఈ కళాశాల

- తొమ్మిదేళ్లలో 1714 మందికి ప్లేస్‌మెంట్
- రెండేళ్ల క్రితం నుంచి జాతీయ నూతన విద్యా విధానం అమలు
- ఇంజినీరింగ్ హానర్స్ డిగ్రీ కొనసాగింపు
- ఈ ఏడాది నుంచి మైనర్ సబ్జెక్ట్‌గా క్వాంటం కంప్యూటర్




విజయనగరం అర్బన్:

రాష్ట్రంలో ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల సందడి తాజాగా మొదలైంది. ఈ నేపథ్యంలో ఉత్తమ ప్రమాణాలున్న కళాశాలలను ఎంపిక చేసుకొనే పనిలో ఇంజినీరింగ్ అభ్యర్థులు బిజీగా ఉన్నారు. నగర శివారున ఉన్న జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఉద్యోగ కల్పనలో ముందు వరుసలో ఉంది. రెండేళ్ల నుంచి నూతన విద్యా విధానాన్ని అమలులోకి తెచ్చింది. మరో వైపు ఉన్నత విద్య శాఖ ఈ కళాశాల ప్రాంగణంలోనే జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీని ఏర్పాటు చేసింది. విద్యార్థుల నైపుణ్యాలను పెంచే విధంగా మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ కోర్సులలో హానర్స్, మైనర్ పేరుతో విస్తరణ డిగ్రీలను గత ఏడాది నుంచి ప్రవేశ పెడుతుంది. జాతీయ నూతన విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి రూపొందించిన నూతన సిలబస్, బోధనా విధానాన్ని అమలులోకి తెచ్చింది. మొత్తం 8 సెమిస్టర్స్‌లో తొలి మూడు మినహా మిగిలిన ఐదు సెమిస్టర్స్‌తో పాటు పది నెలల ఇంటర్న్‌షిప్ చేయిస్తారు. ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్, ఈసీఈ, ట్రిపుల్ ఈ, ఐటీ, మెకానికల్ డిగ్రీలలో 66 సీట్ల చొప్పున, సివిల్, మెటలర్జికల్ సబ్జెక్టు డిగ్రీలలో 33 సీట్లు వంతున కోర్సులను నిర్వహిస్తుంది.

ఇంజినీరింగ్ హానర్స్ డిగ్రీ

విద్యార్థుల సామర్థ్యాల స్థాయికి అనుగుణంగా ఇంజినీరింగ్ డిగ్రీని మూడు విధాలుగా విభజించారు. ఎప్పటి మాదిరిగా ఇచ్చిన కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులకు యధావిధిగా సాధారణ బీటెక్ డిగ్రీ వస్తుంది. డిగ్రీ సిలబస్‌తో పాటు ఇతరేత్ర (డిగ్రీ సబ్జెక్టులకు సంబంధం లేని) అదనపు ప్రతిభాంశాలను ఉన్నట్టు నిర్ధారించుకున్న వారికి హానర్ డిగ్రీ ప్రకటిస్తారు. ఇందు కోసం మొత్తం ఎనిమిది సెమిస్టర్స్‌లోనూ 80 శాతం ఉత్తీర్ణతను చూపాల్సి ఉంటుంది. తొలిత రెండో సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలలో అప్పటికి పూర్తయిన మూడు సెమిస్టర్లలో 80 శాతంతో చూపిన ఫలితాల (ఒకేసారి ఉత్తర్ణత పొందాలి) ఆధారంగా రిజిస్టర్ అయిన విద్యార్థిని హానర్ డిగ్రీ విభాగంలోకి తీసుకుంటారు. అప్పటి నుంచి చివరి సెమిస్టర్ వరకు కనీసం 160 క్రెడిట్ పాయింట్లతో పాటు అదనపు నైపుణ్యాలపై మరో 20 క్రెడిట్ పాయింట్లు తెచ్చుకోవాలి.



తొమ్మిదేళ్లలో ప్లేస్‌మెంట్ ద్వారా ఉద్యోగాలను పొందిన విద్యార్థులు	
సంవత్సరం	ఎంపికైన విద్యార్థులు
2016-17	93
2017-18	145
2018-19	150
2019-20	118
2020-21	178
2021-22	272
2022-23	179
2023-24	120
2024-25	64
మొత్తం	1,714

2025-26 ప్రవేశాలకు ఉన్న కోర్సులు, సీట్లు	
కోర్సులు	సీట్లు
సివిల్	33
సీఎస్‌సీ	66
ఈసీఈ	66
ఈఈఈ	66
ఐటీ	66
మెకానికల్	66
మెటలర్జికల్	33
మొత్తం	396

ఇంజినీరింగ్ మైనర్ డిగ్రీ

నూతన విద్యా విధానం అమలులో భాగంగా విద్యార్థుల సామర్థ్యాలను మెరుగు పరిచే విధంగా మైనర్ డిగ్రీని ప్రవేశ పెట్టారు. చేరిన డిగ్రీకి చెందిన ప్రధాన సబ్జెక్టుతో పాటు ఇతర ఇంజినీరింగ్ కోర్సుల్లో మరో సబ్జెక్టులలో కూడా ప్రతిభ చూపాలనుకొనే వారికి ఈ డిగ్రీ రూపంలో అవకాశాన్నిచ్చారు. మొదటి మూడు సెమిస్టర్ ఫలితాలలో 80 శాతం పాయింట్లను తెచ్చుకున్న వారికి మైనర్ డిగ్రీ కోర్సులకు రిజిస్టర్ చేయిస్తారు.

ఉద్యోగ సాధనకు కళాశాలలో నైపుణ్యాలు పుష్కలం



జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ (ఈసీఈ) 2024-25 విద్యా సంవత్సరంలో పూర్తి చేశాను. తొలి ప్రయత్నంలోనే గేట్ ద్వారా న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్)లో సీనియర్ ఆఫీసర్-సీ పోస్టు సాధించాను. కళాశాలలో నైపుణ్యాభివృద్ధికి అనుగుణంగా అందించే బోధనలు వల్లే సాధించగలిగాను. ప్రత్యేకించి ఉన్న ప్లేస్‌మెంట్ విభాగం ఆ దిశగా అందించిన శిక్షణ వల్ల ఉద్యోగం లభించింది.
–వానపల్లి లలితావ ప్రదీప్ కుమార్

ఈ ఏడాది నుంచి మైనర్ సబ్జెక్ట్‌గా క్వాంటం కంప్యూటర్



ఉద్యోగ, ఉపాధి అధికంగా ఉన్న క్వాంటం కంప్యూటర్ సబ్జెక్టును ఈ ఏడాది నుంచి మైనర్ సబ్జెక్టుగా ప్రవేశ పెడుతున్నాం. నూతన విద్యా విధానం అమలు నేపథ్యంలో విద్యార్థుల కోసం ఈ అవకాశం కల్పిస్తున్నాం. దేశ విదేశాల సంస్థల్లో ఉద్యోగ కల్పనే లక్ష్యంగా విద్యార్థులకు గ్లోబలైజ్డ్ నైపుణ్యాలపై మెరుగుపరిచే ప్రణాళికలను రూపొందించాం. దేశ, అంతర్జాతీయ స్థాయిలోని 13 ప్రతిష్టాత్మక కంపెనీలతో ఉద్యోగ నియామక ఒప్పందాలు పెట్టుకున్నాం. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం.
– ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, ప్రిన్సిపాల్, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, విజయనగరం

తొమ్మిదేళ్లలో 1714 మందికి ప్లేస్‌మెంట్

ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో 2007లో ప్రారంభం అయిన ఈ కళాశాల తొలి బ్యాచ్ నుంచి తాజాగా రిలీవ్ అయిన బ్యాచ్ వరకు ప్రతి ఏడాదిలోనూ ప్లేస్‌మెంట్లు తెచ్చి పెట్టింది. దినదినాభివృద్ధిగా మౌలిక సదుపాయాలు, బోధనా సామర్థ్యాలను పెంచుకుంటుంది. రిలీవ్ అయిన తొమ్మిది బ్యాచ్‌ల నుంచి 1714 మంది విద్యార్థులకు ఉద్యోగాలొచ్చాయి. వివిధ కంపెనీలలో అత్యధికంగా రూ.18 లక్షల వార్షిక వేతన ఉద్యోగాలతో పాటు గ్యాట్ ద్వారా ప్రతి ఏడాదిలోనూ ఉద్యోగాలను ఈ కళాశాల ఇప్పించింది.

క్లుప్తంగా

అనాలోచిత అధికారులను వదిలించుకోండి

- పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సూర్యనారాయణ


పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సూర్యనారాయణ

పార్వతీపురం రూరల్: విద్యాశాఖాధికారులు తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రభుత్వం మాట పడాల్సి వస్తోందని, ఈ మేరకు మంత్రి వారిని వదిలించుకునే ప్రయత్నం చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరాపు సూర్యనారాయణ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తవిటినాయుడు, కాగాన విజయ్ సంబంధిత విద్యాశాఖామంత్రి లోకేష్‌కు హితవు పలికారు. ఆర్థికశాఖ అనుమతి తీసుకోకుండా ఉపాధ్యాయ పోస్టులను కొన్ని పాఠశాలలకు మంజూరు చేయకుండా బదిలీలు చేయడం వల్లే జీతాల చెల్లింపునకు సమస్య వచ్చిందన్నారు. ఇప్పటికి కూడా విద్యాశాఖాధికారులు ఎప్పటిలోగా పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు చేయగలరో వివరంగా చెప్పలేకపోతున్నారన్నారు. రెండు నెలలు కావస్తున్నా జీతాలు లేక కుటుంబ జీవన పరిస్థితి ఏవిధంగా నెట్టుకురాగలమని పీఆర్‌టీయూ తరఫున ప్రశ్నించారు. అనాలోచిత అధికారుల హడావిడి బదిలీలు చేసిన కారణంగానే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. ఈ మేరకు మంత్రి లోకేష్ అనాలోచిత అధికారుల విధానాలను గుర్తించి దూరం పెట్టాలని ఏరికోరి ఎంచుకున్న శాఖకు మీరు ఎంచుకున్న అధికారుల వల్ల నష్టపోతున్నారన్న విషయాన్ని గ్రహించి ఆ దిశగా ఆలోచన చేయాలని కోరారు.

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు


క్షతగాత్రుడిని 108లో జిల్లా కేంద్రా స్పత్రికి తరలిస్తున్న దృశ్యం

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి నెయ్యిల వీధికి చెందిన సిద్ధాంతంనాగరాజు, సిద్ధాతం వెంకటేష్‌లు తమ బైక్‌పై ఆదివారం మధ్యాహ్నం 3.40 గంటల సమయంలో పెదమేరంగి కూడలికి వెళ్తుండగా పెదమేరంగి రామమందిరం మలుపువద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా డ్యూటీ డాక్టర్ ప్రభుతేజ చికిత్స అందించారు. నాగరాజు పరిస్థితి సీరియస్ కావడంతో 108 ద్వారా పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. చినమేరంగి ఎస్సై పి.అనీష్ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

ఆదివాసీలకు అండగా ఉంటాం

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు


వినతి పత్రం అందుకుంటున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: గిరిజన ప్రాంతంలోని ఆదివాసీలకు అండగా ఉంటామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర రావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన సమస్యలను రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు దృష్టికి సీపీఎం సీనియర్ నాయకుడు ఎం.కృష్ణమూర్తి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేసి ఏజెన్సీలోని పలు సమస్యలను వివరించారు. కురుపాం నియోజకవర్గంతోపాటు ఇతర ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు కొరవడిన పరిస్థితులున్నాయని చెప్పారు. నాణ్యమైన విద్య, వైద్యం అందని పరిస్థితులున్నాయన్నారు. మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు వైద్యసహాయం పొందేందుకు దూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తోందని రహదారి సౌకర్యం లేనందున ఇబ్బందులు పడుతున్నారని కృష్ణమూర్తి తెలిపారు. దీనిపై కమిషన్ ఛైర్మన్ స్పందిస్తూ ఏజెన్సీ ప్రాంతాల సమస్యలను తమ క్షేత్రస్థాయి పర్యటనల్లో గుర్తించి ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని డాక్టర్ శంకర రావు ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కృష్ణమూర్తికి చెప్పారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190



పాలకొండ కోటదుర్గ ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు(ఫైల్) ఇన్‌సెట్లో, శ్రావణలక్ష్మిగా ముస్తాబైన వీరఘట్టం శ్రీ కోటదుర్గతల్లి (ఫైల్)

శ్రావణం.. శుభప్రదం

- ఈనెల 25 నుంచి ప్రారంభం
- ఆగస్టు 3న స్నేహితుల దినోత్సవం
- 8న వరలక్ష్మీ వ్రతం
- 9న రాఖీ పండగ
- 16న శ్రీకృష్ణ జన్మాష్టమి
- పూజలకు సిద్ధమవుతున్న మహిళలు


కోటదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు జరిపించేందుకు సిద్ధం చేసిన మంటపం

వీరఘట్టం: సకల శుభాల శ్రావణ మాసం ఈ నెల 25న ఆరంభం కానుంది. శ్రావణ మాసంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, పవిత్రోత్సవాలు, కృష్ణాష్టమి వేడుకల నేపథ్యంలో ఆలయాల్లో భక్తుల సౌలభ్యం కోసం ఆలయ నిర్వహణ కమిటీలు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నాయి. ఈ మాసంలో ఇంటింటా శ్రావణ శోభ కనిపిస్తుంది. అయితే ఈ మాసంలో వచ్చే ప్రతి శుక్రవారానికి ఓ విశిష్టత ఉంది, అందుచేత మహిళలు ఈరోజును ఎంతో పవిత్రమైన దినంగా భావిస్తారు. నెల రోజులుగా ఆషాఢం కావడంతో ముహూర్తాలు లేవు.ఈనెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుండడంతో మహిళలు శ్రావణ లక్ష్మీ వ్రతాలను ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో చేసేందుకు సిద్ధమవుతున్నారు.ఈనెల 26న మొదటి శుక్రవారం కావడంతో తమ ఇళ్లల్లో, ఆలయాల్లో శ్రావణ లక్ష్మికి పూజలు చేసేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు.

నోముల మాసం శ్రావణం..

పురోహితులు శ్రావణ మాసాన్ని నోముల మాసంగా అభివర్ణిస్తారు. శ్రావణంలో మంగళగౌరీ వ్రతం, వరలక్ష్మీ వ్రతాలను ఆచరిస్తారు. మంగళగౌరీ వ్రతాన్ని శ్రావణంలో వచ్చే ఏ మంగళవారమైనా చేయవచ్చు. ఈ వ్రతాన్ని యువతులు పెళ్లైన ఏడాది తరువాత ఆచరిస్తారు. వరలక్ష్మీ వ్రతాన్ని పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజు జరుపుకుంటారు.ఈ వ్రతాన్ని జీవితాంతం ఆచరిస్తారు.

ముఖ్యమైన పండగలు..

శ్రావణ మాసమంతా పండగల సందడి ఉంటుంది.ఈ నెల 26న తొలి శుక్రవారం, ఆగస్టు 1న రెండవ శుక్రవారం, ఆగస్టు 3న ఆదివారం స్నేహితుల దినోత్సవం, ఆగస్టు 8న మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం, ఆగస్టు 9న రాఖీ పండగ, అదే రోజు జంధ్యాల పౌర్ణమి, ఆగస్టు 15న నాల్గవ శుక్రవారం, ఆగస్టు 16న శ్రీకృష్ణ జన్మాష్టమి వంటి ముఖ్యమైన పండగలు శ్రావణంలో ఉన్నాయి. ఆగస్టు 22న ఐదవ శుక్రవారంతో శ్రావణ మాసం ముగుస్తుంది.శ్రావణం పూర్తయిన వెంటనే భాద్రపదం మాసం ఈ ఏడాది ఆగస్టు 27న జరగనున్న వినాయకచవితితో ప్రారంభంకానుంది.

ఈ నెల 28 నుంచి మంచి ముహూర్తాలు..

నెల రోజులుగా ఉన్న ఆషాఢ మాసం ఈనెల 22తో ముగియనుంది. ఈనెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుంది. దీంతో ఈనెల 28 నుంచి ఆగస్టు 22 వరకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణ మాసంలో వ్రతాలతో పాటు పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, శుభాకార్యాలకు మంచి రోజులు కావడంతో శుభకార్యాలు చేపట్టేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా జూలై 26,27,30,31ఆగస్టు నెలలో1,3,4,6, 7, 8, 9, 10, 11, 13,14,17,18 తేదీలో పెళ్లి ముహూర్తాలు ఉన్నాయి. శ్రావణమాసంలో ఉన్న 17 మంచి ముహూర్తాల్లో జిల్లాలో వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయని పురోహితులు చెబుతున్నారు.

శ్రావణమాసానికి అత్యంత ప్రాధాన్యం



సకల శుభాలను ఒసగే శ్రావణం జ్ఞానస్థితిని అందిస్తుంది. హరిహర భేదం లేదని నిరూపించే శ్రావణమాసంలో వైష్ణవారాధనతో పాటు మహాశివుడికి పెద్ద ఎత్తున రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు.ముఖ్యంగా వివాహాది శుభకార్యాలకు శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు ఉన్నాయి.

ఎస్‌వీఎల్ఎస్ శర్మయాజీ, యజ్ఞకర్త, వీరఘట్టం

ఆడలికి తగ్గుతున్న ఆదరణ


వెలవెలబోయిన ఆడలి వ్యూపాయింట్


కొద్ది నెలల కిందట పర్యాటకులతో కళకళలాడుతున్న ఆడలి వ్యూపాయింట్

- టూరిస్టులు లేక వ్యూపాయింట్ వెలవెల
- ప్రమాదాలే కారణమా?

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో అత్యంత ప్రాచుర్యం పొందిన ఆడలి వ్యూపాయింట్ పర్యాటక ప్రాంతం పర్యాటకులు లేక వెలవెలబోతోంది. సుమారు రూ.2 కోట్ల వ్యయంతో ఇక్కడ వ్యూపాయింట్ నిర్మించారు. ఏడాది కిందట పర్యాటక దినోత్సవం రోజున వ్యూ పాయింట్ ఇక్కడ ప్రారంభమైంది. ఒకప్పుడు వందల సంఖ్యలో టూరిస్టులు ప్రతిరోజూ వచ్చి ఇక్కడి అందాలను వీక్షించి వెళ్లేవారు. ఇప్పుడు రోజులో కనీసం 20 మంది కూడా వస్తున్న దాఖలాలు కనిపించడం లేదు. ఆదివారం సెలవు రోజున కూడా రావడానికి ఎవరూ ఆసక్తి చూపించక పోవడం గమనార్హం. దీనికి ప్రధాన కారణం ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లే రహదారిలో ప్రమాదాలు సంభవించడమేనని పలువురు చెబుతున్నారు. ఆడలి వ్యూపాయింట్ ఏర్పాటైన తరువాత మలుపుల వద్ద జరిగిన ప్రమాదాల్లో నలుగురు చనిపోయారు. అలాగే ఆటోలు, టూవీలర్‌లు, మ్యాక్సీక్యాబ్‌లు వంటివి ఘాట్‌రోడ్డులోని మలుపుల వద్ద తిరగబడిపోయి పదుల సంఖ్యలో పర్యాటకులు గాయాలపాలైన వారు ఉన్నారు. ఇక్కడికి వెళ్తే ప్రమాదాలు జరుగుతున్నాయన్న భావన టూరిస్టుల్లో కలగడంతో వ్యూపాయింట్ వెలవెలబోతున్నట్లు తెలుస్తోంది.

నిర్మాణంలో రక్షణగోడ..

ఆడలి వ్యూపాయింట్‌కు వెళ్లే మార్గంలో పలు మలుపుల వద్ద రక్షణగోడలు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడక్కడ హెచ్చరిక బోర్డులు సైతం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. రక్షణగోడలు పూర్తయితే పర్యాటకుల రద్దీ పెరిగే అవకాశం ఉందని టూరిజం శాఖ భావిస్తోంది. ఒకప్పుడు కనువిందు చేసిన ఆడలి వ్యూపాయింట్ ఇప్పుడు వెలవెలబోతుండడం గమనార్హం.



నిర్మాణంలో ఉన్న రక్షణగోడ


ఎమ్మెల్సీ పెనుమత్సకు అభినందనల వెల్లువ


ఎమ్మెల్సీ సురేష్‌బాబును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ తదితరులు

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు) నియమితులు కాగా ఆయనకు పార్టీ శ్రేణుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మొయిద గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు, నగరపంచాయతీ వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావులు పెనుమత్సను సత్కరించి, అభినందనలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ పదవి కట్టబెట్టిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలని, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ, ఇతర నాయకుల సమన్వయంతో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత మత్స సత్యన్నారాయణ, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు, నాయకులు పెనుమత్స సంతోష్, రేగాన శ్రీనివాసరావు, జమ్ము అప్పలనాయుడు, గేదెల రామచిరంజీవి, తర్లాడ దుర్గారావు, అంబళ్ల కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్

- డ్రోన్స్‌తో దాడులు
- ఒకే రోజు 255 ఓడీ, 53 కోఫ్టా కేసుల నమోదు
- మందుబాబులకు కౌన్సెలింగ్


పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతూ ప్రజాశాంతికి భంగం కలిగించినా, విద్యాసంస్థలకు వంద మీటర్ల పరిధిలో సిగరెట్స్, ఇతర పొగాకు ఉత్పత్తులు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లుగా తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, న్యూసెన్స్ చేస్తూ, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. అలాగే వారిపై కేసులు నమోదు చేయాలని, పట్టుబడిన మైనర్లు, మందుబాబులకు కౌన్సెలింగ్ నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందల్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా లేఅవుట్లు, గ్రామ శివారు ప్రాంతాల్లోను, నగర శివారు ప్రాంతాల్లోను, బహిరంగంగా మద్యం తాగిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది డ్రోన్స్ తో దాడులు నిర్వహించారు. ఇక విద్యాసంస్థలకు 100మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు చేసే కిరాణా, పాన్ షాపు వ్యాపారులపై కూడా దాడులు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై కోఫ్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, జరిమానా విధించామని ఎస్పీ తెలిపారు. ఆదివారం ఒక్కరోజునే 255 కేసులు నమోదు చేశామని పొగాకు ఉత్పత్తులు విక్రయించిన వారిపై 53 కేసులు నమోదు చేసి, జరిమానాగా రూ.8,500 విధించామని ఎస్పీ వకుల్ జిందల్ వివరించారు.

పారా సబ్ జూనియర్స్, జూనియర్స్ అథ్లెట్స్ ఎంపిక


అథ్లెటిక్స్‌లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్ క్రీడా మైదానంలో పారా జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విజయనగరం జిల్లాలో 13 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు పారా క్రీడాకారులు వందమందికి పైగా ఈ పోటీల్లో పాల్గొనడం శుభపరిణామమన్నారు. ప్రధానంగా రన్నింగ్, షాట్ పుట్, లాంగ్ జంప్, హై జంప్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని, అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆగస్టులో హర్యానాలో జరగనున్న జాతీయ స్థాయి పారా జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2025 కోసం ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు తురెళ్ల రాము, మన్యం జిల్లా అధ్యక్షుడు చీమల రాంబాబు, ఇంటర్నేషనల్ మెడలిస్ట్ శివగంగ, పారా నేషనల్ స్విమ్మర్ రవి తదితరులు పాల్గొన్నారు.

పాపం..పసివాడు

- గుండె జబ్బుతో బాధపడుతున్న చిన్నారి
- ఆదుకోని ఆరోగ్యశ్రీ
- వైద్యం కోసం డబ్బు లేక తల్లిదండ్రుల విలవిల
- ఆపన్నహస్తం కోసం ఆత్రంగా ఎదురుచూపులు


గుండె జబ్బుతో బాధపడుతున్న బాలుడు నిషాంత్


నిషాంత్‌తో తల్లి అరుణలత

రేగిడి: ముక్కుపచ్చలారని పసికందు. బోసినవ్వులతో అమ్మ ఒడిలో లాలన..ఆలనతో గడిచిపోవలసిన పసిప్రాణం. బాల్యంలోనే మాయదారి రోగం ఆవహించింది. నిరుపేద కుటుంబంలో ఉన్న తల్లిదండ్రులు కూలిపనులు చేస్తే తప్ప పూటగడవని పరిస్థితి. మరోపక్క బాలుడికి ఆపరేషన్ చేయకపోతే ప్రాణభయం ఉందని వైద్యులు చెబుతున్నారు. అంపశయ్యపై ఆ బాలుడు కాలం వెళ్లదీస్తుంటే..ఆర్థిక స్థోమత లేక నిస్సహాయ స్థితిలో తల్లిదండ్రులు విలవిలలాడిపోతు న్నారు. ఇటువంటి తరుణంలో ఆ పసికందు ప్రాణం నిలబెట్టాలంటే మనసున్న వారంతా ఆపన్నహస్తం అందించాలి. వైద్యం ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించాలని తల్లిదండ్రులు ప్రాధేయ పడుతున్నారు. ఇది విజయనగరం జిల్లా రేగిడి మండలం వన్నలి గ్రామానికి చెందిన నాలుగు నెలల బాలుడు బోనెల నిషాంత్ తల్లిదండ్రులు బోనెల రాము, అరుణలత దీనగాథ.

గ్రామానికి చెందిన బోనెల రాము, అరుణలతకు నాలుగు నెలల క్రితం నిషాంత్ జన్మించాడు. పుట్టిన కొద్దిరోజుల వరకు ఆరోగ్యంగా ఉండేవాడు. క్రమేణా పసికందు ఆరోగ్యం క్షీణిస్తుండడంతో తల్లిదండ్రులు తెలుసుకుని ఆస్పత్రులకు తీసుకువెళ్లారు. వైద్యులు తనిఖీల అనంతరం బాలుడికి గుండె సంబంధిత వ్యాధి ఉన్నట్లు నిర్ధారించారు. ఆపరేషన్ చేయాలంటే రూ.6లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెబుతున్నారని బాలుడి తల్లిదండ్రులు వాపోతున్నారు. సహజంగా ప్రతి మనిషికి గుండె ఎడమ భాగంలో ఉంటుంది. కానీ ఈ బాలుడికి గుండె కుడివైపు ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. రాజాం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల్లోని ఆస్పత్రులకు పసివాడిని తిప్పారు. ఇంట్లో ఆర్థిక స్థోమత లేకపోయినా అప్పులు చేసి పిల్లాడిని ఆస్పత్రుల చుట్టూ తిప్పారు. ఇన్ని లక్షలు పెట్టి బాలుడికి వైద్యం చేయలేని పరిస్థితిలో తాము ఉన్నామని రోదిస్తున్నారు.

ఆదుకోని ఆరోగ్య శ్రీ..

ఆరోగ్యశ్రీ పథకం ఆ పసికందును ఆదుకోవడం లేదు. ఎన్టీఆర్ భరోసా ద్వారా తమ కుమారుడిని రక్షించాలని పలుమార్లు వేడుకున్నప్పటికీ ఆస్పత్రుల్లో ఈ వ్యాధికి ఆరోగ్య శ్రీ వర్తించదని చెబుతున్నారన్నారు. దీంతో ఏమీ చేయలేని ఆ కుటుంబం పిల వాడిని చేతిలో ఉంచుకుని బేలచూపులు చూస్తోంది.

మానవతా వాదుల కోసం..

నిరుపేద తల్లిదండ్రులు దాతల నుంచి సహాయం కోరుతున్నారు. నిషాంత్ వైద్యం కోసం సహాయం అందించాలనుకునే మానవతా వాదులు ఫోన్ ఫే నం.7036780839కు ఆర్థికసహాయం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాజన్న బతికుంటే రైతులకీ పాట్లు ఉండేవా?

- ఎమ్మెల్సీ రఘురాజు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి బతికిఉంటే జిందాల్ నిర్వాసిత రైతులకు ఈ పాట్లు ఉండేవి కాదని ఎమ్మెల్సీ రఘురాజు తన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిందాల్ నిర్వాసితుల అగచాట్లు, ప్రభుత్వం వైఖరి, పోలీసుల తీరు, అధికారుల నిర్లక్ష్య వైఖరిపై స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాన్ని నడుపుతున్నది కూటమి సర్కారా? లేక జిందాల్ యాజమాన్యమా? అన్న సందేహం కలుగుతోందన్నారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాన్ని జిందాల్ భూములకు కాపలా కాయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందా? లేక కార్పొరేట్ల సేవలో యంత్రాంగం తరిస్తోందా? అని ప్రశ్నించారు. జిందాల్ భూముల వద్దకు రైతులు వెళ్లకుండా, నిర్వాసితులు రోడ్డు ఎక్కకుండా కాపలా కాయడం, కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం వేతనాలు ఇస్తోందా? లేక జిందాల్ దగ్గర ఉద్యోగాలు చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. దివంగత రాజశేఖర్ రెడ్డి హయాంలోనే జిందాల్‌కు భూములు కేటాయించారని, నేడు వైఎస్ఆర్ ఉండి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. నిర్వాసితులకు జిందాల్ అన్నీ ఇచ్చేసిందని మంత్రులు, కలెక్టర్ అంతా జిందాల్ ఇచ్చిన నోట్‌నే పదే పదే చదువుతారు తప్ప ఎస్‌కోట వచ్చి ప్రెస్‌మీట్ ఎందుకు పెట్టరు? ధైర్యంగా రైతుల ముందుకు ఎందుకురారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే లలితకుమారి స్పందిస్తారని ఆశించినా ఆమె ఏ ఒత్తిళ్ల వల్ల మాట్లాడడం లేదో తెలియడం లేదన్నారు.

డివైడర్ ఢీకొని వ్యక్తి మృతి


దామోదరరావు మృతదేహం

పూసపాటిరేగ : మండలంలోని కోనాడ జంక్షన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్ బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే డెంకాడ మండలం దొడ్డిబాడవ గ్రామానికి చెందిన డోల దామోదరరావు (27) మోటార్ సైకిల్‌పై సర్వీసురోడ్డులో నాతవలస వైపు వెళ్తుండగా కోనాడ జంక్షన్ సమీపంలో డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.